క్లుప్తంగా

ఇన్వర్టర్ బహూకరణ

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీ సీబ్లాక్‌లో ఉన్న గుడ్‌కేర్ హెల్పింగ్ సొసైటీ అండ్ హోమ్‌కు శనివారం ఎస్‌వీజీ మార్కెట్‌లోని ప్రేమసాయి ఎంటర్‌ప్రైజెస్ అధినేత నల్లమిల్లి గోపాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఇన్వర్టర్‌ను బహూకరించారు. ఇన్వర్టర్‌ను హోమ్ నిర్వాహకులకు నల్లమిల్లి గోపాలకృష్ణ, దుర్గా మహాలక్ష్మి దంపతులు అందజేశారు. హోమ్‌లో పేదలకు అల్పాహారం, పండ్లు అందించారు.

కాకినాడ వెళ్లి.. పింఛనిచ్చి



శ్రీరామచంద్రమూర్తికి పింఛన్ అందిస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ భవానీ ప్రసాద్, వలంటీర్ రవికిరణ్

సీటీఆర్ఐ: స్థానిక తొమ్మిదో వార్డు విద్యుత్ కాలనీకి చెందిన ఇళ్ల శ్రీరామచంద్రమూర్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. 17వ సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ భవానీప్రసాద్ అందుడైనప్పటికీ వలంటీర్ రవికిరణ్ సహాయంతో కాకినాడకు వెళ్లి పింఛను సొమ్ము అందజేశారు. ప్రసాద్‌ను పలువురు అభినందించారు.

మాస్కుల ధారణపై అవగాహన

కంబాలచెరువు: స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి విద్యార్థులు నో బ్యాగ్ డేలో భాగంగా శనివారం స్వచ్ఛ పక్వాడా కార్యక్రమంలో మాస్కులను తయారు చేశారు. మాస్క్ తయారీ విధానాన్ని హెచ్‌ఎం ఎంవీఎమ్ సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి హెచ్‌ఎం వరహాగిరి కృష్ణమోహన్ తెలిపారు. నో బ్యాగ్ డేలో భాగంగా స్థానిక కోర్లమ్మపేటలోని కుసుమ నాగన్న ప్రాథమిక పాఠశాలలో చిన్నారులు వివిధ జంతువుల మాస్కులు ధరించి సందడి చేశారు.

సచివాలయ కన్వీనర్‌కు పరామర్శ

కడియం: కడియపుసావరం సచివాలయ కన్వీనర్ బొమ్మిడి క్రాంతికుమార్ అగ్ని ప్రమాదంలో గాయపడగా రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు ఆయన్ని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, పార్టీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పరామర్శించారు. కడియపుసావరం మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు

పలువురికి ఆకుల పరామర్శ

ధవళేశ్వరం: పీఎమ్‌పీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు సతీమణి విజయలక్ష్మి ఇటీవల మృతి చెందారు. దీంతో ధవళేశ్వరంలో ప్రభాకరరావును డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు పరామర్శించారు. దుళ్లలో మాతృ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు సన్నపు బ్రహ్మానందంను, కడియపులంకలో ఉండమట్ల భద్రం కుటుంబ సభ్యులను వీర్రాజు పరామర్శించి ఓదార్చారు.

ఉచిత వైద్య శిబిరం

కడియం: జనసేన అధినేత పవన్ కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక లక్ష్మీగణపతి ఆలయ సెంటర్లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరం కందుల న్యూరో కేర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కందుల కృష్ణతేజ నేతృత్వంలో వైద్యులు రోగులకు ఉచిత వైద్య సేవలు అందించారు.

సమస్యలపై వినతి

కంబాలచెరువు: స్థానికంగా రీజినల్ డైరెక్టర్ జోన్- 2 కార్యాలయానికి వచ్చిన డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ వి.రామిరెడ్డిని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంతి ఆస్కారరావు ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి సిబ్బంది శనివారం కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా సచివాలయ ఏఎన్ఎంలు ఎదుర్కొంటున్న సమస్యలు మొబైల్ యాప్స్, ఎఫ్ఆర్‌ఎస్ అటెండెన్స్ విధానం, సచివాలయ ఏఎన్ఎంలను పూర్తిస్థాయిలో వైద్య ఆరోగ్యశాఖకు కేటాయించి వారిపై పని భారాన్ని తగ్గించడం వంటి విషయాలను వివరించామని ఆస్కారరావు తెలిపారు. ఈ అంశాలపై రామిరెడ్డి సానుకూలంగా స్పందించి సత్వరమే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంవీవీ సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్‌రాజు, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్ ఫీబీ, సచివాలయ ఏఎన్ఎంలు వినీత, సీత, హెవెన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత విద్య

రాజమహేంద్రవరం రూరల్: సత్య సాయిబాబా స్థాపించిన శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు వివిధ రంగాల్లో 50 ఏళ్లుగా ఉచిత సేవలను అందిస్తుందని శ్రీసత్య సాయి గురుకులం కరస్పాండెంట్ శ్యాంసుందర్ తెలిపారు. ట్రస్ట్ స్వర్ణోత్సవ వేడుకలను శనివారం రాజమహేంద్రవరంలోని శ్రీసత్య సాయి గురుకులంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ సహకారంతో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. గురుకులం ప్రిన్సిపాల్ కె.గురయ్య మాట్లాడుతూ తమ పాఠశాలలో వెయ్యి మంది విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా విద్య అందిస్తున్నామన్నారు. జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు సోమసుందరరెడ్డి, సత్యసాయి మందిర ఉపాధ్యక్షుడు హనుమంతరావు, కొవ్వూరు సత్యసాయి సంగీత కళాశాల ఇన్‌చార్జ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షేమంలో చెరగని సంతకం వైఎస్సార్

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు

రాజమహేంద్రవరం రూరల్: సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజల గుండెల్లో దివంగత మాజీ సీఎం డాక్టర్ వైఎస్సార్ చెరగని సంతకాన్ని లిఖించారని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. శనివారం రాజమహేంద్రవరం వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో మహానేత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పార్టీ శ్రేణులు పెద్దఎత్తున నిర్వహించారు. వైఎస్సార్ నిలువెత్తు చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పని చేసిన మహా నేత వైఎస్సార్ అని కొనియాడారు. ప్రజలు బాగుండాలి.. తద్వారా రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలని ఎన్నో పథకాలను సమర్థవంతంగా అమలు చేసి ఉమ్మడి తెలుగు రాష్ట్ర ప్రజలందరి హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించారన్నారు. వైఎస్సార్ కారణ జన్ముడని కొనియాడారు. ప్రజల సంక్షేమానికి వైఎస్సార్ పది అడుగులు వేస్తే.. తండ్రికి మించిన తనయుడు జగన్ వంద అడుగులు ముందుకు వేసి ప్రతి ఒక్కరితో శెభాష్ అనిపించుకుంటున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో మనమంతా నడవడం అదృష్టమని ఎంపీ అన్నారు. పార్టీ అర్బన్ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నక్కా శ్రీనగేష్ తదితరులు మాట్లాడుతూ వైఎస్సార్ పాలనలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రజల కోసమే తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. వైఎస్సార్ సీపీ అభిమానులు, నాయకులు, క్లస్టర్, వార్డు ఇన్‌చార్జులు తదితరులు పాల్గొన్నారు.



పేదలకు అన్నదానం చేస్తున్న ఎంపీ భరత్‌రామ్, సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్

ఆశయాలను కొనసాగిద్దాం

మహానేత వైఎస్సార్ ఆశయాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగిస్తున్నారని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, పార్టీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. రూరల్ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గంలోని దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు, ట్రై సైకిళ్లు, వీల్‌చైర్లను చందన నాగేశ్వర్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమానికి శ్రీకారం చుట్టిన మహానుభావుడు వైఎస్సార్ అని కొనియాడారు. ఎన్నితరాలైనా వైఎస్సార్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. జిల్లా దివ్యాంగుల సెల్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల చక్రవర్తి, కన్నమాంబ దేవస్థానం చైర్మన్ దుంపా చంద్రారెడ్డి, పెయ్యల రాజేష్ తదితరులు పాల్గొన్నారు. బొమ్మూరు వైఎస్సార్ సెంటర్‌లో వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు యెనుముల త్యాగరాజు, మాజీ ఉప సర్పంచ్ దాకే శ్రీనులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ సాంస్కృతిక విభాగ రీజనల్ కోఆర్డినేటర్ ఆశ నాగులపల్లి, కాకులపాటి కుమార్, అక్కుమహంతి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆల్కాట్‌తోట ఐఎల్‌టీడీ సెంటర్‌లో 18వ డివిజన్ సచివాలయ కన్వీనర్ ఎస్‌కే ఇమామ్ (బాబ్జి) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వైఎస్సార్ సీపీ వైద్య విభాగ అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత హాజరై వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, వీల్‌చైర్లు పంపిణీ చేస్తున్న చందన నాగేశ్వర్

మనసున్న మారాజు..

కడియం: మనసున్న మారాజు వైఎస్సార్ అని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు కొనియాడారు. కడియపులంకలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు బోడపాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి వీర్రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీనివాస్, బోడపాటి మూర్తి, పిన్నమరెడ్డి సూర్యచంద్రరావు, కురుమళ్ల ఆంజనేయులు పాల్గొన్నారు. కడియంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరిజాల వీర్రాజు (బాబు), పార్టీ నాయకుల ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కడియం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు, పంపిణీ చేశారు.



కడియపులంకలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు



వైఎస్సార్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న రుడా మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి



ఆజాద్ చౌక్‌లో వైఎస్సార్‌కు నివాళులు అర్పిస్తున్న ఎంపీ భరత్‌రామ్, సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్

జయహో రాజన్న

నగరంలో మహానేతకు జేజేలు

రాజమహేంద్రవరం సిటీ: నిస్వార్థ సంక్షేమ పాలనా దక్షుడు డాక్టర్ వైఎస్సార్ అని నగరంలో పలుచోట్ల నిర్వహించిన వైఎస్సార్ వర్ధంతి సభలలో ఎంపీ భరత్‌రామ్ అన్నారు. తిలక్ రోడ్డు సిటీ కోఆర్డినేటర్ కార్యాలయం, కోటగుమ్మం సెంటర్, లాలాచెరువు సెంటర్, తాడితోట సెంటర్ వాంబే గృహ సముదాయం తదితర ప్రాంతాల్లో జరిగిన వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాల్లో ఎంపీ భరత్‌రామ్, పార్టీ అర్బన్ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ తండ్రి బాటలో పయనిస్తూ పేదల సంక్షేమానికి పాటుపడుతున్న సీఎం జగన్‌కు అందరి మద్దతు ఇవ్వాలన్నారు. నగర అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమన్నారు. వివిధ ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, నక్కా శ్రీనగేష్, పోలు విజయలక్ష్మి, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, నగర యువజన విభాగం అధ్యక్షుడు పీతా రామకృష్ణ, మజ్జి అప్పారావు, ఎన్వీ శ్రీనివాస్, ప్రవీణ్ చౌదరి, బర్రే కొండబాబు, అజ్జరపు వాసు, కటం రజనీకాంత్, కలే చిన్ని, అడపా రాజు, ముత్యాల వీరఅప్పారావు, బిల్డర్ చిన్న, టీకే విశ్వేశ్వరరెడ్డి, చీర రాజు, బొప్పన సుబ్బారావు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ కార్యాలయంలో ఎంపీ మార్గాని భరత్‌రామ్, నగర కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లు వైఎస్సార్‌కు ఘన నివాళి అర్పించారు. క్వారీ మార్కెట్ సెంటర్‌లో 48వ డివిజన్ మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు ఆధ్వర్యంలో ఏర్పాటైన అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీ, సిటీ కోఆర్డినేటర్‌లు ప్రారంభించారు. కోటగుమ్మం జంక్షన్‌లో వైఎస్సార్ విగ్రహానికి ఎంపీ నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సమైక్యాంధ్ర ఉద్యమ సమయంలో కోటగుమ్మం సెంటర్‌లో తుపాను నేపథ్యంలోనూ వైఎస్సార్ పాదాల చెంత ఏపీఐడీసీ రాష్ట్ర డైరెక్టర్ కానుబోయిన సాగర్ 36 గంటల దీక్ష చేసి అందరిలో స్ఫూర్తి నింపారన్నారు. జాంపేటలో మహానేత రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి మాజీ రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి పూలమాలలు వేశారు. నాయకులు గుదే రఘు నరేష్, బీసీ యువసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శరత్‌కుమార్, మేడిబోయిన సునీల్, ఎస్‌కే షరీఫ్ పాల్గొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు గూడూరి విజయ భారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ గూడూరి రాధిక రొట్టెలు పంపిణీ చేశారు. నాయకులు వై.శ్యామల, డాక్టర్ గూడూరి కమల్, సంతోష్ రెడ్డి పాల్గొన్నారు. కంబాలచెరువు సెంటర్‌లో జక్కంపూడి రామ్మోహన్‌రావు విగ్రహం వద్ద వైఎస్సార్ చిత్రపటానికి వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పూలమాలలు వేశారు. అడపా వెంకటరమణ, నరవలంక సత్యనారాయణ, గోపాలకృష్ణ పాల్గొన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు మార్టిన్ లూథర్ ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు పీసీసీ సభ్యుడు తాడేపల్లి మురళీధర్ పాల్గొన్నారు. ఆజాద్ చౌక్‌లో రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి ఎంపీ మార్గాని భరత్‌రామ్, సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పూలమాలలు వేశారు.



పేదలకు రొట్టెలు పంచి పెడుతున్న వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి

ధవళేశ్వరంలో..

ధవళేశ్వరం: దివంగత మాజీ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ నాయకులు సాధనాల చంద్రశేఖర్, విప్పర్తి వెంకటరమణ, తలారి వరప్రసాద్, గోలి దేవకుమార్, ఒంటిద్దు కృష్ణ, పెన్నాడ జయప్రసాద్, షబ్బీర్ బాషా, పేర్ల బాసి, బోడపాటి కుమార్, శ్రీరంగం బాలరాజు తదితరులు అన్నారు. పోలీస్ స్టేషన్ సెంటర్, అగ్రహారం సెంటర్, ఇండస్ట్రీయల్ కాలనీలలోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేశారు.

పరిశుభ్రమైన నీరు అందించండి



రేవులో వ్యర్థాలను తొలగిస్తున్న విశ్వేశ్వరరెడ్డి తదితరులు


రాజమహేంద్రవరం సిటీ: నగర ప్రజలకు రక్షిత తాగునీరు, పుణ్య స్నానాలకు పరిశుభ్రమైన జలాలు అందించాలని రాజమహేంద్రి గోదావరి పరిరక్షణ సమితి చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మార్కండేయ స్వామి రేవులో ఆయన సమితి సభ్యులతో కలసి గోదావరిలో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించారు. ఆయన మాట్లాడుతూ విజయ రామరాజు మున్సిపల్ కమిషనర్‌గా ఉన్నప్పుడు గోదావరిలో చెత్త తొలగింపునకు ఓఎన్జీసీ సహకారంతో రూ.50 లక్షలతో మెషీన్ కొనుగోలు చేశారని, నెల తర్వాత అది కనిపించలేదన్నారు. అనంతరం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రంతో ముద్రించిన టీ షర్టులను పంచి పెట్టారు.

కాలువల్లో పూడిక తొలగించండి

రాజమహేంద్రవరం సిటీ: కాలువల్లో పేరుకుపోతున్న పూడికలను ఎప్పటికప్పుడు తొలగించాలని మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్ ఆదేశించారు. శనివారం కురిసిన వర్షానికి ముంపునకు గురైన శ్యామలా సెంటర్, ఆల్కాట్ గార్డెన్స్, గూడ్స్ షెడ్ ప్రాంతాలను సందర్శించారు. ఆయన అధికారులతో మాట్లాడుతూ ప్రధాన కాలువలన్నింటిలో పూడికలను తొలగించాలన్నారు. ముంపునకు అవకాశమున్న ప్రాంతాల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వర్షం వచ్చిన వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేసి కాలువలను శుభ్రం చేసే పనులు చేపట్టాలన్నారు.

రోడ్ల విస్తరణకు సహకరించండి

స్థానిక మోరంపూడి, తూర్పు రైల్వే స్టేషన్ రోడ్ల విస్తరణకు సహకరించాలని కమిషనర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఆ రోడ్లలో నివాసితులతో స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మోరంపూడి రోడ్డుకు సమాంతరంగా ట్రాఫిక్ రద్దీ తగ్గించడానికి ఆవలో వంద అడుగుల రోడ్డు నిర్మిస్తామన్నారు. రోడ్డు విస్తరణతో స్థలం కోల్పోయిన వారికి టీడీఆర్ మార్కెట్ రేట్ విలువపై నాలుగు రెట్లు ఇస్తామన్నారు.



గూడ్స్ గేట్ వద్ద ముంపునీటి లిఫ్టింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

కందుకూరి ఆశయ సాధనకు కృషి

కంబాలచెరువు: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ఫౌండేషన్ డే, ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రీజినల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి కృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా ప్రతి విద్యార్థిని సన్నద్ధం కావాలన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల హెచ్ఓడీ ప్రొఫెసర్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ కందుకూరి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన్ని సత్కరించారు. కళాశాలలో అత్యున్నత మార్కులు, క్రీడల్లో రాణించిన విద్యార్థినులను అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవకుమారి, మాజీ కార్పొరేటర్ శ్రీహరి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేఎస్ రత్నకుమార్, స్టూడెంట్ యూనియన్ సలహాదారులు డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, డాక్టర్ కె.నీరజ తదితరులు పాల్గొన్నారు.